# జన్మదిన కానుక

**చిన్నదో, పెద్దదో – జీవితంలో తప్పంటూ చేయనివారు ఉండరు. కానీ, దోషి మీద కోపంతో అతని వాళ్ళందరినీ ద్వేషించడం సబబా?**

అమ్మా, అమ్మోయ్."

పాతికేళ్ళ కొడుకు పసిపిల్లాడిలా పిలుస్తుంటే వర్ధనమ్మ పెదాల మీద చిరునవ్వు సరిగమ లాడింది.

"ఏ...విట్రా?" గొంతు పదనిసలు పలికింది.

"నీకీ రోజు పుట్టిన రోజు కానుకిస్తానే."

"నీ మొహం. ఇది నీ పుట్టిన రోజు. కానుక నీకే ఇవ్వాలి."

"నీలాంటి అమృతమూర్తి పేగు తెంచుకు పుట్టడమే ఓ గొప్ప కానుకమ్మా."

తల వంచి తల్లి పాదాలకు మొక్కాడు గోవర్ధన్.

తల్లి ఎదలో అమృత తరంగాలెగిసి పడినై. అక్షింతలు నెత్తిమీద చల్లి, లేపి అమాంతం గుండెలకు హత్తుకుంది.

"నాన్నా... నా కన్నా." గుండెల్లోంచి పొంగు కొచ్చిన వాత్సల్యరసం బిందువులై జలజలా కళ్ళలోంచి రాలింది.

"అబ్బా, నేనింకా అల్లాటప్పా పిల్లాడిని కానమ్మా. నేనో పోలీసాఫీసర్ని."

"నువ్వో పోలీసాఫీసరువైనా, పోర్టరువైనా నా కొడుకువే గదా. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే నాన్నా. పాతికేళ్ళు నీ నెత్తిమీదకొచ్చినా నా ముందు చిన్నపిల్లాడివే.

తనలో తానే నవ్వుకుంది.

"అయితే, ప్రేమలో పడ్డావన్నమాటా!"

"హబ్బో, యస్సైగారి బుగ్గల మీద సిగ్గులు సింగారించుకున్నాయే."

"ఆ అమ్మాయీ, నేనూ మనసిచ్చి పుచ్చుకున్నా మమ్మా."

అమ్మో, వీడో అమాయకుడూ, అర్భకుడూ అనుకున్నానే.

"తథాస్తు. ఆ అమ్మాయిని వెంటనే తీసుకురా."

ఆహా, రాబోయే కోడలంటే కాబోయే అత్తగారి కెంతిదో.

"తప్పకుండానమ్మా." కాఫీ కప్పు గటగటా ఖాళీ చేసి టకటకా నడిచాడు. క్యాపు నెత్తిమీదుంచుకుని స్కూటర్ స్టార్ట్ చేశాడు. కొడుకు వెళ్ళినవైపే చూస్తూ నిలుచుంది వర్ధనమ్మ.

'వీనికన్నీ నా బుద్ధులే వచ్చినై. వీని నాన్న ఆదినారాయణే బతికుంటే ఎంత సంబరపడి పోయేవాడో. కొడుకు పోలీసాఫీసరయాడని కొండెక్కి కూర్చునేవాడే. అవునూ, పెళ్ళి మాటెత్తితే గొల్లున నవ్వి విషయం దారి మళ్ళించే గోవర్ధన్... తమాషాకనలేదు గదా. ఊఁహూఁ. అయ్యుండదు. అయినా, ఉరకలు వేసే దోరవయసు. పరుగులు దీసే కోర్కెల గుర్రాలు... ఇంకెన్ని రోజులుంటాడలా'

పొద్దుట్నుంచి వర్ధనమ్మ హడావిడి అంతా ఇంతా గాదు. తల స్నానం, పూజాదులు కాగానే గోవర్ధన్‌కు తలంటు స్నానం చేయించింది. వెంట్రుకలకు సాంబ్రాణి పొగ వేసింది. దిష్టి తీసింది. అతడు తండ్రి ఫోటోకు నమస్కరించి డ్రస్సు వేసుకునేలోగా జీడిపప్పుతో గుమగుమలాడే ఉప్మా తయారు చేసింది. స్వీటుముక్క నోట్లో పెట్టి స్వయంగా టిఫిన్ తినిపించింది. మాతృదేవో భవ అని అందుకే అన్నారేమో! అమ్మ అనే రెండక్షరాలను అమృతంలో ముంచి తీశారేమో!

"నాన్నా, నాకు కోడలు కావాలిరా." కొంగుతో మూతి తుడిచింది. తల్లి అలా అడగడమెన్నోసారో గుర్తుకొచ్చి నవ్వొచ్చింది.

పాపం అమ్మ. ఇంటి పనులతో సతమతమై పోతోంది. వృద్ధాప్యం ముసురుకొస్తుంటే, ఆయాసం తరుముకొస్తోంది.

పనిమనిషి వద్దంటుంది. కోడలే కావాలని పట్టుపడుతుంది.

"నేన్నీకియ్యబోయే కానుక అదేనమ్మా."

"అంటే," బిత్తరపోయింది. నుదుటి అనుభవ రేఖలు అల్లిబిల్లిగా ముడేసుకున్నై.

"నాకు తెలీకుండానే నీకు పె... పె... పెళ్ళై..."

"అయ్యో, అది కాదమ్మా." తన మాటవరుసకు తానే నొచ్చుకున్నాడు. నీక్కాబోయే కోడల్ని తెచ్చి చూపిస్తానీ రోజు."

హమ్మయ్య. నా కొడుకు నా అదుపాజ్ఞల్లోనే ఉన్నాడు.

గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత అనుకుంటూ అన్నం, కూర, చారు తయారుచేసింది.

వాణ్ణెత్తిమీద నాలుగక్షింతలు పడితే నేను నిశ్చింతగా తీర్థయాత్రలకెళ్ళి రావచ్చు. సంవత్సరం తిరిగేలోగా బుల్లి మనవణ్ణెత్తుకోవచ్చు. చిన్నారి నవ్వులతో నా ఇంట రతనాల పంట పండాలి. తియ్యని ఊహల్లో తేలిపోతూ స్వీటూ, హాటు తయారు చేసింది. ఆ తర్వాత టీవీ ఆన్ చేసి సోఫాలో కూర్చుంది. చూపులు టీవీ తెర మీదున్నా మనో నేత్రాలు కోడలి కోసం ఎదురు చూస్తున్నై.

బయట ఎండ చిటపటలాడుతోంది.

అబ్బా, వీడు త్వరగా వస్తే బావుండేది. ఉండబట్టలేక గడపదాకా వచ్చింది.

ఝూమ్మంటూ స్కూటరొచ్చింది.

గోవర్ధన్ వెనుక కాబోయే కోడలు. ఈ ఇంటి వెలుగు. గోవర్ధన్ అడుగులో అడుగేసుకుంటూ చిరునవ్వులు చిందిస్తోంది.

నవ్వు కాదది, పున్నమి వెన్నెల జల్లు. ఎప్పుడో విన్నట్టు, 'చంద్ర కళావతంసే, కుచోన్నతే కుంకుమ రాగ శోణే...' శుభ్రమైన నీటి ప్రవాహంలో కదుల్తున్న చేపల్లాంటి కళ్ళు.

వారెవ్వా, నా కొడుకు సెలక్షన్ సూపర్. తటాలున లోపలికొచ్చేసింది.

"అమ్మా, ఇదిగో నీక్కాబోయే కోడలు – సుజాత. పరిచయం చేసేలోగా సుజాత నాజూగ్గా వంగి వర్ధనమ్మ పాదాలకు నమస్కారం చేసింది.

వర్ధనమ్మ మనసు పాలసముద్రమైంది.

భుజాలు పట్టి లేపి గుండెలకు హత్తుకుంది.

ఈ దేవకన్య పేరు సుజాతా. మరి... ఆ సుజాత, ఈ సుజాత కాదు గదా. కనుబొమలు పీటముడేసుకున్నై.

డ్రస్సు మార్చుకొచ్చాడు గోవర్ధన్.

"మేము గుడికెళ్ళి పూజ చేయించి వస్తామమ్మా."

సుజాత చేతిలో చెయ్యేసి, పద అన్నట్టుగా సైగ చేశాడు.

వర్ధనమ్మ చూపులు సుజాత నాపాదమస్తకం తడిమాయి. కళ్ళల్లో కళ్ళు కలిశాయొక్షణం.

"వస్తామండీ." కాటుక కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా టపటపలాడినై.

సోఫాలో కూలబడింది వర్ధనమ్మ.

గతం నీలినీడలు అంతరంగమ్మీదాడుకుంటున్నై...

ఆదినారాయణ తన మెడలో మూడు ముళ్ళేయగానే జీవితంలో మురిపాల మూట విప్పుకుంది.

మూడేళ్ళు మూడు సినిమాలు, ఆరు షికార్లుగా గడిచినై. తాను కాన్పుకు పుట్టింటికెళ్ళొచ్చాక ఆదినారాయణ అదేపనిగా తాగుతున్నాడని అర్థమైంది. అదేదో హాబీ అనుకుంది ముందు. తాను చెల్లి పెళ్ళికి వెళ్ళొచ్చి ఇంట్లో అడుగు పెట్టగానే గాజుల గలగలలు, అమ్మాయి కిలకిలలు వినిపించాయి. గబుక్కున బెడ్రూం తలుపు తోసేసి నిశ్చేష్టురాలైంది.

అతని కౌగిట్లో అర్ధనగ్నంగా అమ్మాయి. పక్కన ఖాళీ విస్కీ బాటిల్. వాసన గుప్పుమంది.

గుండెల్లో తుపాకీ పేలింది. నోరు తెరుచుకుపోయింది. నరాల్లో ఉక్రోషం ఉరకలు... పళ్ళు బిగుసుకుపోయినై.

అతని సైగలందుకుని అమ్మాయి మాయమైంది.

"ఎవరా అమ్మాయి." గొంతు చించుకొచ్చింది. తానలా అరవగలనని అప్పుడే తెలిసొచ్చింది. ముక్కు పుటాలెగురుతున్నై. పళ్ళు పటపటలాడుతున్నై.

"ఆమె... ఆ...మెనా." పట్టపగలు దొంగతనం చేస్తూ పదిమందికి దొరికిపోయినట్టు... తత్తరపాటు.

"ఆమే... ఆమె... నా చిన్నప్పటి క్లాసుమేటు వర్ధనా. ఏదో పనిమీద ఇక్కడికొచ్చిందిటా..." బలవంతపు ఇకిలింపు.

మత్తు దిగిపోయిందేమో హుషారయ్యాడు.

"ఆహాహా, దూడ గడ్డి కోసం తాటి చెట్టెక్కినట్టు గ్లాసుమేటును క్లాసుమేటంటున్నారా? క్లాసుమేటుకు కౌగిట్లో తప్ప మరెక్కడా స్థానం లేదన్నమాట..."

"అరె, అడవిలో సింహంలాగా, ఆఫీసులో బాస్‌లాగా... ఆ చూపులేమిటే?" గుర్రుమని సర్రున గది బయటికొచ్చాడు.

గాయమ్మీద కారం చల్లినట్లయింది.

"చూడండీ, ఒక్క అబద్ధాన్ని దాచేందుకు పెక్కు అబద్ధాలాడాలి. వజ్రాన్ని వజ్రంతో కొయ్యొచ్చుగానీ, అబద్ధాన్ని అబద్ధంతో కప్పిపుచ్చలేరు."

"అబ్బా... మరేమంటావిప్పుడు?" రోషం.

"ఈ దేశం పతివ్రతలకిలవేలుపు. ఇక్కడి ఇల్లాలు దేన్నైనా సహిస్తుంది గానీ, ఇంటాయన కౌగిట్లో మరో ఇంతి ఇకయికల్ని భరించలేదు. ఆకలి సింహంలా ఎగబడ్తుంది జాగ్రత్త." మనసులోని కుతకుత మాటల్లోకొచ్చింది.

"నామీద నిందలేస్తున్నావ్...!"

"ఇది నిందకాదండీ. కళ్ళతో చూసిన కటిక నిజం."

"నీ బొంద. నోర్మూసుకో." తన చెంపలు చెళ్ళుమన్నై.

తల నేలకేసుకొని చరచరా బయటికెళ్ళిపోయాడు.

తిరిగివచ్చాక తలపట్టుక్కూర్చున్నాడు. పొరపాటై పోయిందని పొద్దంతా చేతులు పట్టుకు ప్రాధేయపడ్డాడు.

ఆ రోజు నుంచి అతని ప్రవర్తనలో అనుమానం రాలేదు.

కాలం గిర్రుమంటోంది. గోవర్ధన్ భాగ్యనగర్‌లో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరాడు. ప్రజ్ఞాపూర్ బాలికల రెసిడెన్షియల్ హైస్కూల్లో పి.జీ



చిత్రాలు: నర్సిం

టీచర్‌గా ఆదినారాయణ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్న రోజులవి. టీచర్ల వసతి గూడా స్కూల్ కాంపౌండ్‌లోనే కాబట్టి తనకెక్కడా హాయిగా ఉంది.

ఓ రోజు తానూ, మరో టీచర్ భార్య సినిమా కోసం సంతోష్ థియేటర్‌కు సంతోషంగా వెళ్ళారు. అది మెగాస్టార్ చిరంజీవి నటించిన సినిమా కాబట్టి అప్పటికే చిరంజీవులతో నిండిపోయింది. టికెట్లు దొరక్క తక్కున వెనక్కు తిరగాల్సి వచ్చినందుకు - స్వర్గానికెళ్ళబోయి, సందులో దూరినట్టనిపించింది.

"చూశారా!" ఇంట్లో ప్రవేశిస్తూ అంది తాను. "ఏనుగుల్లా వెళ్ళి పీనుగుల్లా వచ్చేశామండీ!"

ఆదినారాయణ కనబడలేదు. పడగ్గదిలో అలికిడి...

"వ్వ... వద్దు సార్!" ఆడపిల్ల గొంతు.

"నువ్వేమీ భయపడొద్దు..." ఆదినారాయణ బుజ్జగింపు.

"అబ్బా... ఇంట్లో ఉన్నది మనిద్దరమే. అట్లా బెదురుతావెందుకూ?"

"సార్సార్!... మ్మా... అయ్యో... మా నాన్నది పోలీస్ డిపార్ట్‌మెంట్ సార్. ఆఁ... అయ్యో... నా పరికిణీ..."

"మరేమీ ఫరవాలేదు. అరవొద్దు మరి. ఆఁ..."

తన ఎదలో ఆటంబాంబు పేలింది. "ఆగండి... ఆగండి..." అంటూ బెడ్రూం తలుపులు బాదేసింది. గబుక్కున తలుపులు తెరిచిందా అమ్మాయి. వేటగాడి బాణాలను తప్పించుకుంటున్న లేడిపిల్లలా బయటికొచ్చేసింది. ఒళ్ళంతా వణికిపోతోంది. గుడ్డలు, వెంట్రుకలు చిందరవందరైపోయినై.

"నీ... పేరు సుజాత కదూ! పదో తరగతి కదూ!"

"అవును. చూడండమ్మా మాస్టారు లెక్కలు చెబుతా రమ్మని రెక్కలు పట్టకొని... " బోరుమంది.

తనలో కోపం, అసహ్యం పోటీలుపడి పొంగుకొచ్చినై.

"సిగ్గు లేదూ! శిష్యురాలు కూతురు లాంటిది. మీరింతకు దిగజారతారని కలలో కూడా ఊహించలేదు. మనిషికో మాట, గొడ్డుకో దెబ్బ.. " దులిపేసింది.

ఆ తర్వాత సుజాత దుస్తులు దులిపి మొహం కడిగి బొట్టు పెట్టింది. జడవేస్తూ -

"చూడమ్మా సుజాతా, మాస్టారి ఆరోగ్యం బాగాలేదు. ఈ సంగతి ఎవ్వరికీ చెప్పొద్దమ్మా. మళ్ళీ ఎప్పుడూ ఇలా ఒంటరిగా రావొద్దమ్మా..." బుజ్జగించింది. , బలవంతంగా కాఫీ తాగించి పంపించింది.

ఇంత జరిగినా ఆ మానవుడు కిమ్మనడే. తల, కాళ్ళు నేలకు వేళ్ళాడేసి మంచమ్మీద కూర్చున్నాడు.

"అమ్మా, ఇదిగో నీక్కాబోయే కోడలు-సుజాత." పరిచయం చేసేలోగా సుజాత నాజూగ్గా వంగి వర్ధనమ్మ పాదాలకు నమస్కారం చేసింది. వర్ధనమ్మ మనసు పాలసముద్రమైంది.

"ఆ అమ్మాయి తండ్రిది పోలీస్ డిపార్ట్‌మెంటని మొత్తుకుంటున్నా వినబడలేదంటే... 'కామాతురాణాం న భయం న లజ్జ' ఛీ, ఛీ... ఇంత నీచానికి దిగుతారా?" తన జుట్టు పీక్కోవాలో, అతని జుట్టు పట్టి లాగి, లెంపలు వాయించాలో అర్థం కాని పరిస్థితి. "నేను వచ్చాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ అమ్మాయి మీ కామాగ్నిలో ఆహుతైపోయేది. ఆ తర్వాత మిమ్మల్ని బొక్కలో తోసి ఏ కీలు కాకీలు విడదీసి బొక్క బొక్కకూ నీళ్ళు పోసేవారు. ఉద్యోగం ఊడిపోయేది..." ఎంతో కోపమొచ్చింది కానీ, అదే కోపం కొంపముంచేస్తుందేమోనని భయమేసింది. గుండెలోని పొంగుల్ని కుంగదీసుకోక తప్పలేదు.

ఆత్మీయులు అపరాధానికి పాల్పడితే ఓ వైపు ఉక్రోషం ఉరకలేస్తుంది. మరోవైపు ఆవేదన అంతరాత్మను తొలిచేస్తుంది.

"మీరిలాగే ప్రవర్తిస్తే నేనేం చేస్తానో నాకే తెలీదండీ! ధనం పోతే కష్టపడి సంపాదించుకోవచ్చు. ఆరోగ్యం చెడితే వైద్యం చేయించుకోవచ్చు, కానీ, మనిషి పశువైతే బతుకే బండలైపోతుందండీ!..." వెక్కి వెక్కి ఏడ్చింది.

వద్దు... వద్దు వర్ధనా!" గబుక్కున లేచొచ్చి చేతులు పట్టుకున్నాడు. "ఇవి చేతులు కావనుకో..." గొంతులో గురగురలు. "నాకు బుద్ధొచ్చింది. శనీశ్వరుడు నెత్తిమీదకొచ్చి అలా చేయించాడు. ఇహ ఈ జన్మలో ఇలాంటి పనులు చెయ్యను. స్వర్గాన ఉన్న మా అమ్మానాన్నల మీద ఒట్టు. ఈ క్షణం నుంచీ తాగుడు కూడా మానేస్తా. ఆ తాగుడే ఇంత పని చేయించింది..." చేతిగుడ్డతో కళ్ళు అద్ది, కౌగిట్లో బంధించాడు.

ఆ సంఘటన అతణ్ణి బాగా కుంగదీసింది. పాపభీతి, దైవభీతి మేల్కొన్నాయేమో తనలో తానే కుమిలిపోసాగాడు. హైదరాబాదుకు ట్రాన్స్‌ఫరొచ్చిందప్పుడే. అయితే ఏం లాభం? నడిరోడ్డు మీద స్కూటర్ నడుపుతూ నాంపల్లిలో బస్సును ఢీ కొట్టాడు. స్కూలుకు చేరాల్సినవాడు స్వర్గానికెళ్ళాడు.

అనుమానం లేదు... ఆ సుజాతే... నన్ను గుర్తు పట్టిందేమో!

"అలా కూర్చున్నావేమమ్మా?"

ఎప్పుడొచ్చాడో గోవర్ధన్ పక్కనే కూర్చున్నాడు.

"ఏం లేదురా!" కొంగుతో ముఖం అద్దుకుంది.

"సుజాత ఏదిరా?"

"గుళ్ళో పూజ కాగానే గప్‌చుప్‌గా వెళ్ళిపోయిం



దమ్మా" అన్నాడు నీరసంగా.

"ఏం? ఎందుకలా?"

"ఏమోనమ్మా?" డ్రస్సు మార్చుకుంటూ, "మనింటికొచ్చేప్పుడు హుషారు పిట్టలాగున్న సుజాత, గుడికెళ్ళేటప్పుడు గుంభనంగా కనిపించింది. పూజ కాగానే ఆటోమేటిక్‌గా ఆటోలో వెళ్ళిపోయింది." ఉసూరుమన్నాడు.

అయితే, ఆ పిల్ల అసహ్యించుకుందన్నమాట. చరిత్రహీనుణ్ణి ధరిత్రి కూడా క్షమించదు. తండ్రి చేసిన పాపం తనయుణ్ణి పట్టి పీడిస్తుందేమో!

"ఇంతకీ ఆమె తండ్రి ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు?"

"ఎవరో ఎక్కడో ఏదో చేస్తుంటే నాకింత బాధ ఉండేది కాదమ్మా. ఆయన మా యస్పీగారమ్మా. ఆయన యస్సైగా డిపార్ట్‌మెంటులో చేరి అడుగడుగునా సుడిగుండాలు దాటుతూ, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ ఆ స్థాయికి చేరుకున్నాడమ్మా."

అసలు విషయం దాచిపెడితే అపార్థానికి దారి తియ్యొచ్చు. అనుకోనిదేదన్నా జరగొచ్చు. ప్రజ్ఞాపూర్ సంఘటననంతా పూసగుచ్చినట్టు చెప్పేసి చివరికి, "ఇదంతా మన కర్మ బాబూ" అంది విచారంగా.

"అదా సంగతి." నిట్టూర్చాడు. "అందుకేనేమో, గుడి మెట్లు ఎక్కేటప్పుడు 'ఆదినారాయణ మాస్టారు మీ నాన్నగారా? ఆయన ప్రజ్ఞాపూర్‌లో పంజేశారా? ఎప్పుడు పోయారు? ఎలా పోయారు?' అని ఆరాలు తీసిందమ్మా. ఆ సంగతి నీకెలా తెలుసంటే కళ్ళలోకి సూటిగా చూసి తల వంచుకుంది."

> **వడగ్గదిలో అలికిడి... "వ్వ... వద్దు సార్!" ఆడపిల్ల గొంతు. "నువ్వేమీ భయపడొద్దు..." ఆదినారాయణ బుజ్జగింపు. "అబ్బా... ఇంట్లో ఉన్నది మనిద్దరమే. అట్లా బెదురుతావెందుకూ?"**

దేవుడా! ఆయన తప్పిదానికి వీని ప్రేమ బలైపోవాలా? లేక లేక ఇష్టపడిన అమ్మాయి... అయ్యో, నా కొడుకేమైపోతాడో ఏమో! తల్లి మనసు తల్లడిల్లిపోతోంది.

నేనో సామాన్యమైన యస్సైని. సుజాత వాళ్ళ నాన్నకంతా చెప్పేస్తుంది. ఆయన అగ్గిమీద గుగ్గిలమైపోతాడు. పగబడతాడు. నా బతుకు భద్రాచలం బస్టాండైపోతుందేమో. గోవర్ధన్‌లో కలకలం.

సర్రున ఇంటిముందో కారాగింది.

"మిస్టర్ గోవర్ధన్!" కంచు కంఠం ఖంగుమంది.

"అమ్మా. మా యస్పీగారొస్తున్నారే!". గోవర్ధన్ గుండెల్లో గులకరాళ్ళు దొర్లాయి. భుజాలను కొంగుతో కప్పుకొని వంటింట్లోకి తప్పుకుంది వర్ధనమ్మ.

"రండి సార్. రండి."

"గోవర్ధన్. నువ్వింత గోల్‌మాల్ మనిషివనుకోలేదయ్యా." యస్పీగారి గొంతు యమ సీరియస్‌గా ఉంది.

అమ్మాయి ద్వారా అంతా విని ఇంటరాగేషన్ కొచ్చుంటాడు.

"సారీ సర్." చేతులు కట్టుకోవాల్సి వచ్చింది.

"ఫస్టిన్ఫర్మేషన్లోనే నీ గురించి ఇంత తెలిసిందంటే, నువ్వెంతటివాడివో ఇన్వెస్టిగేషన్లో తేలాల్సిందే."

"ముందు... మీ... మీరిలా. కూ..." ధైర్యంగా మాట్లాడాలనుకున్నా కంగారు కుంగదీస్తోంది. "మీరిలా కూర్చోండి సార్."

"కూర్చుంటా. వాళ్ళు రానీ. ముందు నిన్ను కూర్చోబెట్టాలి గదా!"

అంటే, అరెస్ట్ చేసి జీపులో కూర్చోబెడతాడా!

పోలీసు బలగమొస్తుందా! ఏ సెక్షన్ ప్రకారం అరెస్ట్... అయినా, పోలీసు అధికారులకు సంయమనం కరవుగానీ, సెక్షన్లకు కరవా? "అది కాద్సార్... స్సర్..."

"అదో వచ్చేస్తున్నారు."

సుజాత గూడా ఛాతీ విరుచుకొని ఠీవిగా వస్తోంది.

"అరెస్టు చేసేందుకు మీ అమ్మాయా సార్?"

"చూస్తావుగా!"

యస్పీ చురుకైన చూపులు సుజాత వైపు మళ్ళాయి, నువ్వే చెప్పమన్నట్లుగా.

"మా నాన్నకంతా చెప్పేశాను." మురిసిపోతోంది.

ముసిముసిగా నవ్వుతోంది. ఆ నవ్వు గజిబిజిగా ఉంది.

"అంటే... ప్రజ్ఞాపూర్‌లో మా నాన్నగారి..."

"దాంతోనే గదా కేసుకు బలమొచ్చింది. వెంటనే మా నాన్నను లాకొచ్చాను."

చూపులు తండ్రి వైపు మళ్ళాయి. మిగతాది నువ్వే చెప్పమన్నట్లుగా.

"మిస్టర్ గోవర్ధన్! ఈ రోజు నీ బర్త్‌డేనట గదా!"

"అవున్సార్..." ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు.

"ఈ రోజే నా పుట్టిన రోజు."

"నీకు జన్మదిన కానుకివ్వాలని వచ్చాం. బీ రెడీ."

కాఫీ కప్పులతో వస్తున్న వర్ధనమ్మ కాళ్ళల్లో సన్నని వణుకు.

"అయినా, వాని తప్పేముందండీ?"

"తప్పు కాదా?" అప్పుడే వచ్చిన యస్పీ భార్య అందుకుంది.

"అదృష్టజాతకురాలైన మా సుజాతను చెప్పా పెట్టకుండా బుట్టలో వేసుకోవడం తప్పు కాదా?"

"మీ అమ్మాయే చెప్పొచ్చు గదా!" మనసు వెనక్కు లాగుతున్నా మనిషి కాఫీ అందించబోయింది.

"వద్దు వదినగారూ!" యస్పీ భార్యకు నవ్వాగలేదు.

"గలికితే అతకదంటారు గదా! ముందు తాంబూలాలు. ఆ తర్వాతే కాఫీలు."

"ఆ రోజు నువ్వే గనక అడ్డుపడకపోతే మా అమ్మాయి బతుకేమైపోయేదో!" యస్పీగారు కూడా నవ్వుతున్నారు.

"నీ భర్త ఎలాంటి వాడనేది మాకనవసరం. నీ కొడుకు గుణగణాలే మా కవసరం. ఎంతయినా ఆడపిల్ల వాళ్ళం గదమ్మా! తాంబూలాలతో తరలొచ్చాం. పురోహితునిక్కూడా ఫోన్ చేసొచ్చాం."

"వస్తున్నానండీ... వస్తున్నా." చంకలో పంచాంగంతో ఎంచక్కా ప్రవేశించాడు పురోహితుడు.

రెండు చేతుల్లో బుట్టలతో డ్రైవర్ వచ్చాడు.

సిగ్గుల భారాన్నాపుకోలేక సతమతమై పోతోంది సుజాత. ■